ఆహ్వానిస్తారు ? అతనువట్టి కాలేజీ లెక్చరరు. పోనీ ఏ పోలీసు కనిస్టేబన్నా అయితే నలుగురూ ఝడిసి కొంతమన్నన చేసేవారే. తీరా తానుగా వెళ్తే టోపీలో పడాలిసొస్తుందేమోనని అనుమానం వేసిన మాట మాత్రం నిజం. అంతలో ఒక కొట్టుదగ్గర జనం 'జానకీ! జానకీ!' అని సంబోధిస్తూ కూరల కోసం యెగబడ్డాన్ని చూసి యీ పేరేదో బాగుంది యిక్కడకొంటే మంచిదని లోనికి తొంగిచూశాడు. మనిషి బొగ్గుల బస్తాకు మల్లేవుంది. మెళ్ళోపట్టెడ—కాసులదండ—ముక్కున నత్తు—చేతిని మురుగులు. వొంటినిండా బంగారంతో కొట్టవచ్చేట్లుగా మాట్లాడుతోంది.

అహోబలరావు వూరుకోవచ్చా—ఏ మనుకున్నాడో—ఎదురుగుండా కొట్లోంచి వచ్చే మనుష్యుల్ని 'ఎల్లా కొన్నారు? సరిగ్గా తూచిందా? నిన్నట్లానేనా ఏమన్నా ధరలు తగ్గాయా?' అంటూ వాకబులు ప్రారంభించాడు. జానకిని ఆ జనం మధ్య నుంచే అహోబలరావు ఆకర్షించాడు. దాన్తో వదిలిందా—'ఆ రాళ్లు సరేనా-ఆ కాటా అల్లా వుందే? తక్కెట్లో దాళవా ఏమన్నా వుందా?' అంటూ తన ప్రజ్ఞను వెళ్ళబెట్టబోయాడు. తాటకిలా జానకి కస్సుమని 'ఏందయ్యో—కొన్నావులే గాని ఎల్లు. ఇసుమంటి మాటలాడక. ఎప్పుడన్నా బజారుచేసిన మొహవేనా—' అంది దురుసుగా. అంతా గొల్లుమన్నారు. అంతట్లోకే ఆ దారిని పోతూన్న మరోమనిషి నుద్దేశించి 'పోలయ్యా! గంపమీద చెయ్యేసెల్లు. కొనకపోతే మాన్లే—డబ్బుకీ పానానకీ లంకె. నీ సెయ్యి మంచిది బాబో!' అని వొక గావుకేక పెట్టి, చిన్నబుచ్చుకుని తిరిగి వెళ్లిపోతూన్న అహోబలరావు అమాయిక వాదాన్ని చూసి జాలిపడినదై దారి కడ్డంపడి 'రా అయ్యో! కోపగించి పోతావా తమ్ముడూ! కొనకుండాబోతే సచ్చి నీ కడుపు నుడతా' అని చెయ్యి బుచ్చుకు తీసికెళ్లి - 'ఉప్పు పులుసు తినే పానానికి కోపం రాదయ్యా? నీ రాళ్లు తక్కెడ తప్పంటివే? నీ అప్పను కానా—నాను తప్పుడుముండనేగా నీ వూసు—'

అహోబలరావు నవ్వి - 'అప్పా! నువ్వు మంచిదానివేలే.' అన్నాడు. 'అట్టాగను బాబూ! నీ నాటి దొరబాబులు కోపగిస్తే జానకి సచ్చేనా-బతికేనా—'

కూరలన్నీ తూచాక డబ్బులిస్తోంటే జానకి అంది.

'రోజూ యిటేరా తమ్ముడూ. డబ్బులియ్యాల గాకపోతే రేపియ్యి. నీ దయుండాలి గాని జానకి డబ్బే యేటి కెదురీత్తుంది.'

అహోబలరావు వెళ్ళొస్తానని యింటి ముఖం పట్టాడు. ఈ ఆప్యాయతను అత నిదివరకు ఎక్కడా చవిచూడలేదు. ప్రపంచంలోని యిన్ని ముఖాలు, ముఖానికో మనస్తత్వం, చొప్పున వుంటూంటే జానకిని దేంట్లో జేరిస్తే బాగుంటుందో అతని కెంతకూ తట్టలేదు.

## 9

అహోబలరావును ఉద్యోగంలో నుంచిపూడ పెరికేయత్నంలో విజయం మనది కాబోతున్నదని ప్రసాదరావు శంఖారావం చేసి వెళ్లాక ముఖ్యంగా ఆనందించినది విజయ తల్లి. దమయంతి విచారంగా 'చూడండి.' ఒకరినోటివద్ద అన్నాన్ని అధికారమనే చిన్నబెడ్డతో పడగొట్టడం మహాపాపం సుమండీ. పదిమంది కలయిల్లు ..' అని వాపోతుంటే తల్లివిసవిసా చేతు లాడించుకుంటూ' 'రైల్లో నాకు జరిగిన అవమానం యింతా—అంతా, పుస్తకాలూ కాగితాలు పెట్టిలోంచి గిరవాటేస్తానంది ఆతింగరది. వాడో—ముక్కు పచ్చలార నిదాన్ని ఆడబిడ్డను నడి రోడ్డులో పడగొట్టి అవమానపరుస్తాడూ? స్త్రీలజోలికి పోయినవాళ్లు అనుభవించాల్సిందే. పెద్దా చిన్నా గౌరవ మర్యాదలెన్నకుండా ప్రవర్తించినందుకు కావలిసిందేయీ ప్రాయశ్చిత్తం.' అంటూ తన అక్కసును వెళ్లబోసింది. దమయంతి చిన్నబుచ్చుకున్న ముఖంతో అక్కడనుంచి వెళ్లిపోయింది. ఇంతవరకూ వచ్చాక మనం చేస్తున్నది పాపమేమో అనే చింతవిజయకు కూడా కలిగింది. లైబ్రరీనుంచి తెచ్చిననవలను పూర్తిచేద్దామని పుటలు తెరిచి చదవబోయే సరికి సత్యాహింసలు—ప్రపంచ శాంతిమీద చెమటోడ్చి ఉపన్యాసమిచ్చే అహోబలరావు దీనవదనమే మాటిమాటికి విజయకళ్లముందు నాట్యమాడసాగింది. పైకిచూస్తే నభోమండలాననల్లటి కారు మబ్బులగుంపులు అక్కడక్కడ విచ్చి తెల్లతెలబడ్తూ కదుల్తూ గోచరించాయి. కాలేజీలకు ఆఫీసులకు వెళ్లేటైమయింది. అది కుర్రవాళ్లు వడివడిగా

